“మధూ వచ్చాడా--”

ఆమె ఆత్రాన్ని గమనించింది హేమ.

“వచ్చాడు-- గిల్టీగా వరండా అంతా తిరిగాడు. ఇవాళుదయం అనుకుంటా ..... ఎవరూ చూడకుండా రహస్యంగా కొడుకుని చూసుకొని వెళ్ళిపోయాడు. తర్వాత ..... రెండు మూడుసార్లు ఫోన్ చేశాడు-- నీకు మెలుకువొచ్చిందో లేదోనని అడిగాడు.”

“చూసెళ్ళాడా--” నెమ్మదిగా అంటూ గదిలో గోడకు వేలాడుతున్న కేలండర్ వేపు చూసింది మహతి.

ఆమె గుండెలు గుబగుబ లాడాయి.

“ఇవాళ ఫస్టా ..... ” ఆశ్చర్యంగా అడుగుతున్న మహతివేపు మరింత ఆశ్చర్యంగా చూసింది హేమ.

“టైమెంతయింది హేమ .....”

“పది కావొస్తోంది.”

“హేమ ..... అర్జంట్‌గా నాకో పని చేసిపెట్టు ..... అర్జంట్‌గా మా ఆఫీసుకు ఫోన్ చెయ్యి ..... కారుని పంపమని చెప్పు.”

“కారెందుకు, ఈ టైమ్‌లో ..... ”

“లేదు హేమా -- దేనికోసమైతే నేనింత రిస్క్ తీసుకున్నానో ఆ, నా , లక్ష్యం సిద్ధించే టైం. ఇంకో గంట మాత్రమే వుంది. నేను అర్జంటుగా బయటికెళ్ళాలి.”

“ఈ పరిస్థితిలోనా ..... ? ” మరింత కంగారుగా అడిగింది హేమ.

“ఎస్ ..... ఇప్పుడే-” బెడ్ మీంచి లేస్తూ అంది మహతి. కొంచెం దూరంగా వున్న టేబిల్‌వేపు నడిచి-- జన్నీ ఫాబ్రిక్స్‌కి ఫోన్ చేసింది.

"రఘురామశెట్టిగారా ..... నేను మహతిని ..... నా టేబిల్లో కుడి డ్రాయర్లో ఒక కవరుంటుంది. ఆ కవర్ని తీసుకొని ఒక్కసారి హాస్పిటల్‌కి రాగలరా?"

"అలాగేనమ్మా...." మరో పావుగంట తర్వాత, హాస్పిటల్ పోర్టికోలో కారాగింది.

హేమ ఎంత వారించినా వినలేదు.

పురిటి బిడ్డను భుజాలమీద  వేసుకుని, లోన్నించి వచ్చింది.

డాక్టర్లు, నర్లుసలు, మిగతా స్టాఫ్ ఆశ్చర్యంగా చూస్తున్నారు ఆ దృశ్యాన్ని.

కార్లో కూర్చున్నాక మహతి నోటంట ఒకటే మాట వచ్చింది.

"మెహదీపట్నం స్టేట్ బ్యాంకుకు పోనీ ..... " అని

కారు క్రాస్ రోడ్‌మీదుగా పరుగెడుతోంది.

అప్పుడు చటుక్కున పక్కన కూర్చున్న డాక్టర్ హేమకు ఓ విషయం జ్ఞాపకానికొచ్చింది.

"మహీ ..... ఇప్పుడు బ్యాంకు కెందుకే ..... అందులోనూ ... ఇవాళ సండే ...."

సండే - సండే - సండే - సండే - సండే - ఆ మాటన్న హేమవేపు చివుక్కున తలతిప్పి చూసింది.

"ఆర్యూ ష్యూర్."

"ఎస్ ..... "

లేదు- ఈ అరవై నిమిషాలు తన జీవితంలో గొప్ప నిమిషాలు. ఇవే తన ఆత్మ విశ్వాసానికి సోఫానాలు- సండే ..... బ్యాంకులకు హాలీడే కావచ్చు ..... జీవితానికి

కాదు. జీవితంలో లక్ష్యానికికాదు. తన అంచనా ప్రకారం ఇప్పటికే అక్కడ తనకోసం మధుకర్ ఎదురు చూస్తుంటాడు.

"అయినా ఫర్వాలేదు. పోనీ ..... "

10.15, 10.20, 10.25, 10.30, 10.35, 10.40., కారు జనాన్ని చీల్చుకుని మసాబ్‌టాంకు రోడ్డుమీద మలుపు తిరిగి, మెహిదీపట్నం రోడ్డువేపు సూటిగా సాగిపోతోంది ..... మెహిదీపట్నం ట్రాఫిక్ ఐలెండ్ దగ్గర కాడు స్లో అయింది ..... మగతగా కళ్ళు మూసుకున్న మహతి--

కళ్ళిప్పి చూసింది.

అక్కడేం జరుగుతోందో ఒక్క నిమిషం అర్థంకాలేదు మహతికి.

ట్రాఫిక్ ఐలేండ్ దగ్గర్నించి బ్యాంక్‌కి వెళ్ళే దారి తోరణాలతో  అలంకరించబడి వుంది.

అటూ ఇటూ  వందలాది యూనివర్శిటీ స్టూడెంట్స్ ..... వాళ్ళ చేతుల్లో ప్లే కార్డ్స్ ..... పైన వేలాడుతున్న బానర్లు .....

WELCOME TO MAHATI :

WELCOME TO IRON YOUNG LADY MAHATI :

మహతి కారు ట్రాఫిక్ ఐలెండ్ దగ్గరకు వచ్చేసరికి.

"మహతి ..... జిందాబాద్ ..... మహతి ..... జిందాబాద్ ..... "

సముద్ర తరంగాల్లా స్లోగన్లు .....

జనం మధ్య నుంచి పూలపడవలా కారు నడుస్తోంది ..... తన కళ్ళను తనే నమ్మలేక ఆశ్చర్యంగా చూసింది.

మహతి కారు బ్యాంక్ ముందు ఆగగానే, అంతవరకూ నినాదాల స్థానంలో మంగళవాయిద్యాల హోరు.

"ఏమిటి ఇదంతా." పెద్ద ఫజిల్లా ఉంది హేమకు అది.

"నాకూ తెలీదే ..... "

కారు మెల్లగా బ్యాంక్ ముందు ఆగింది.

ఎవరో డోర్ తెరిచారు.

కారు దిగాలో, లేదో తెలియలేదు మహతికి.

"దిగమ్మా ..... నీ కోసమే మేమంతా ఎదురు చూస్తున్నాం ..... " ఆ గొంతు విన్పించిన వ్య క్తివేపు చూసింది మహతి.

రాఘవేంద్ర నాయుడు .....

రాఘవేంద్ర నాయుడు .....

మరో మాట మాట్లాడకుండా, కారులోంచి కిందకు దిగింది మహతి.

కొంచెం దూరంలో నిలబడున్న భువనేశ్వరి దేవి మహతి చేతిలోని బిడ్డను అందుకుంది.

"ఏమిటండీ ..... ఇదంతా ..... " తనలో తను గొణుక్కుంటున్నట్టుగా అంది మహతి.

దూరంగా బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతూ కనిపించాడు మధుకర్.

చేతిలోని కవర్‌తో, నెమ్మదిగా బ్యాంక్ మేనేజర్ వేపు నడిచింది మహతి.

బ్యాంక్‌కి అనుకునివున్న ఆడిటోరియం ప్రముఖుల్తో నిండిపోయింది.

ఆ ఆడిటోరియంలో-- ఎత్తైన వేదిక. ఆ వేదిక అద్భుతమైన అలంకరణతో నిండి ఉంది.

* * *

మరో పావుగంట తర్వాత--

వేదిక మీద మహతి, ఆ పక్కన మధుకర్ ..... మైకు దగ్గర రాఘవేంద్ర నాయుడు .....

రాఘవేంద్ర నాయుడు మాట్లాడడం ప్రారంభించాడు.

"మైడియర్ ఫ్రెండ్స్ అండ్ రెలెటివ్స్ ..... ఏ కృష్ణా ఓబ్రాయ్ ఆడిటోరియం లాంటి ప్రదేశంలో ఏర్పాటు చెయ్యాల్సిన మీటింగ్, ఇప్పుడిక్కడ ఏర్పాటు చెయ్యడం, చాలామందికి సందేహంగానూ, విస్మయంగానూ ఉండొచ్చు.

ఎందుకీ ఫంక్షన్, ఏమిటి దీని పర్పస్ అని చాలామంది నన్నడుగుతున్నారు .....

ఇది ఒక అరుదైన సంఘటన. దిసీజ్ ఏ రేర్ ఇన్సిడెంట్ ..... నన్ను ఇన్‌స్పైయిర్ చేసిన ఇన్సిడెంట్ .....

వ్యసనాలపాలైన ఓ కోటీశ్వరుడి కొడుకుని జనం మధ్యకు తీసుకొచ్చి, ఇదీ జీవితం అని చూపెట్టి, ఆ జీవితానికో లక్ష్యం ఉందని చెప్పిన ఒక ఆదర్శ యువతి జీవితం ఈ ఫంక్షన్ .....

ఒక్క పైసా పెట్టుబడి లేకుండా, లక్షల ఆస్తిని వదులుకొని, సుఖాలను వదులుకుని-- ఆత్మవిశ్వాసమే ఊపిరిగా-- నమ్మిన సత్యమే పునాదిగా-- అతి తక్కువ టైమ్‌లో నిరంతర శ్రమ, నిరంతర దీక్షలతో కోట్ల రూపాయల టర్నోవర్ గల కంపెనీల్ని వాళ్ళిద్దరూ స్థాపించారు.

వాళ్ళిద్దరూ మహతి ..... మధుకర్.

మహతి ఇన్‌స్పిరేషన్ లేకపోతే మధుకర్ లేడు .....

రాఘవేంద్ర నాయుడు కొడుకుగానే మధుకర్ ఉండేవాడు .....

కానీ --

శిలను ఉలితో శిల్పంగా మలిచినట్టుగా మధుకర్‌ని మలిచి, యాడ్ ఇండియా కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా చేసింది.

కేవలం .....

పన్నెండు నెలలు ..... పన్నెండు నెలలకు మన భారతదేశంలో ఏమాత్రం విలువ లేదు ..... కానీ --

ఒక పన్నెండు నెలల సమయాన్ని--

సరైన మార్గంలో పెట్టుకుంటే--

ఈనాటి యువత సాధించలేనిది  ఏమీ లేదని అన్నదానికి నిదర్శనంగా--

మహతి తన జీవితాన్ని కూడా మలచుకుంది.

అన్ని అవమానాలను తనకు అనుకూలంగా మలచుకుంది. ఇవాళ దేశంలో సెన్సేషన్ సృష్టిస్తున్న జెన్నీ ఫ్యాబ్రిక్స్ సంస్థకు మూలస్తంభమై నిలిచింది.

సంస్థలూ, సంస్థల కోట్ల టర్నోవరూ కాదు ప్రధానం .....

లక్ష్యం .....
గోల్ .....

టార్గెట్ .....

అందుకే ----

ఇది జీవితానికి, జీవితంలో విలువలకు సంబంధించిన సంఘటన .....

ఇది  ఎదుగుతున్న, ఎదగబోయే, ఆశలతో భవిష్యత్తుకు రూపకల్పన చేసుకునే ప్రతి భారతీయ యువకుడి జీవితానికీ సంబంధించిన ఉత్తేజకరమైన సంఘటన .....

మహతి ..... మీకూ నాకూ అందరికీ ఆడపిల్లే ..... కానీ ..... ఈ తరానికి ఒక ఆశ .....

SOME MEN ARE SUCCESSFUL AS LONG AS SOME ONE ELSE STANDS BACK OF THEM AND ENCOURAGES THEM, AND SOME MEN ARE SUCCESSFUL IN SPITE OF HELL !

బాధల్లోంచి, వంటరితనంలోంచి తను బయటకు రావడమే కాకుండా, మధుకర్‌ను యువతకు ప్రతినిధిగా నిలిపింది--

లక్ష్యాన్ని నిర్ధేశించింది .....

ఒక సంవత్సర కాలంలో స్వంతంగా కష్టపడి ఎంతో కొంత సంపాదించాలని ..... ప్రతినెలా తూ చా తప్పకుండా పొదుపు చేయాలని, ఇక్కడ ఇదే బ్యాంకులో ఎకౌంట్లు ప్రారంభించారు. ఎవరెక్కువ సంపాదిస్తే, వారే విజేత అనే పందాన్ని ప్రారంభించారు.

ఇప్పుడు ఆ ఎకౌంట్లు వివరాల్ని బ్యాంక్ మానేజర్ ప్రకటిస్తారు."

అనంతరం- బ్యాంకు మానేజర్ వేదికనెక్కాడు.

మహతా? మధుకరా? విజేత ఎవరు?

అంతర్లీనంగా వాళ్ళిద్దర్లో కూడా ఏదో గుబులు--- అందరి చూపులూ వేదికమీదే వున్నాయి.

బ్యాంకు మానేజర్ చదవడం ప్రారంభించాడు.

"మొదటి ఎకౌంట్‌లో వున్నది ..... 15 లక్షల 25 వేల 5 వందలు " చెప్పటం ఆపాడు మానేజర్.

మొదటి ఎకౌంట్ ఎవరిది? రెండో ఎకౌంట్ ఎవరిది?

వందల కళ్ళు విప్పారి చూస్తున్నాయి .....

"15 లక్షల 25 వేల 6 వందలున్న మొదటి ఎకౌంట్ ..... మహతిది."

ఆడిటోరియం అంతా చప్పట్లతో మార్మోగిపోయింది.

పున్నాగ పువ్వుల ప్రశాంతతో నిండిన కళ్ళతో మహతి, మధుకర్ వేపు చూసింది.

అయిదు నిముషాల సేపు హాలంతా చప్పట్లతో మార్మోగిపోతూనే వుంది.

రాఘవేంద్ర నాయుడు మళ్ళీ మైక్ ముందుకొచ్చాడు.

"ప్రస్తుతమున్న స్థితిలో మహతిని మాట్లాడమనడం భావ్యంకాదు. కానీ ..... ఈ దేశపు యువతరంలోని స్ఫూర్తికి ప్రతినిధి అయిన మహతి మాట్లాడాలని ..... "

తనే స్వయంగా మైక్‌ని ఆమె కందించాడాయన.

మహతి నెమ్మదిగా లేచింది.

" మధుకర్ మధ్య, నా మధ్య పందెం మా ఇద్దరి మధ్య పందెంగానే నిలుస్తుందనుకున్నాను. కానీ ..... ఇంతమంది మధ్యకు మే మొస్తామని అనుకోలేదు ..... ఎందుకంటే ..... **Will power, man power.** తో సాధించలేనిది ఏమీలేదన్న దానికి నిదర్శనంగా వుండాలని అనుకున్నాం. దానికో లక్ష్యం పెట్టుకున్నాం. ఒక టైమ్, ఒక బ్యాంక్ ఎకౌంట్ ..... నా బ్యాంక్ ఎకౌంట్‌లో ఒక వంద

రూపాయలు ఎక్కువచ్చాయి. అంతమాత్రాన నన్ను విజేత అనడం న్యాయంకాదు ..... ఎందుకంటే.. నాకంటే గొప్ప వ్యక్తిగా మధుకర్‌ని నిలబెట్టడానికి కృషి చేసాను. కాని నా లక్ష్యం నెరవేరలేదు.

అందువల్ల నేను విజేతను కాను. నా లక్ష్యసాధనలో నేను ఓడిపోయాను. అయినా ఫర్వాలేదు. ఇవాల్టి ఓటమి రేపటి విజయానికి నాంది.''

మహతి ఆ మాట అంటున్న సమయంలో బ్యాంకు మేనేజర్ మధుకర్ వేపు చూశాడు.

సరిగ్గా వంద రూపాయలే ఎందుకు ఎక్కువగా వచ్చాయో అన్న విషయం తెల్సిన వ్యక్తి ఒక్క బ్రాంచ్ మేనేజరే. అతను మహతి రావడానికి అరగంట క్రితమే బ్రాంచ్ మేనేజర్‌ని కలిసాడు. యిద్దరి ఎకౌంట్లూ తీయించాడు. తమ పందెం గురించి చెప్పాడు.

కాకతాళీయంగా సమానంగా వచ్చిన ఎకౌంట్లలో .....

తన ఎకౌంట్‌లోంచి ఒక వంద రూపాయలు తగ్గించాడు.

''అవును సర్ ..... మహతి ఓడిపోగూడదు ..... మహతి గెలవాలి ..... మహతి గెలవాలి ..... '' ఆ మాట అంటున్నపుడు ఆమె పట్ల పైశాచికంగా తన ప్రవర్తన గుర్తుకొచ్చింది.

ఒక పరాజయం కంటే ఒక సంతృప్తి గొప్పది.

తను కోరి పరాజయాన్ని కోరుకున్నాడు.

ఆ రహస్యం మరెవరికీ తెలియకూడదని బ్యాంకు మానేజర్ని కోరాడు మధుకర్.

'' మధుకర్ మాట్లాడాలి ..... మాట్లాడాలి ..... ''

మధుకర్ నెమ్మదిగా లేచాడు.

ఆడిటోరియంలో ముందు వరసలో కూర్చున్న తన తల్లి దగ్గర కెళ్ళి ఆ తల్లి ఒడిలో నిద్రపోతున్న పురిటికందును తీసుకుని స్టేజిముందుకొచ్చాడు.

“మైడియర్ ఫ్రెండ్స్ ..... నేను ఓడిపోలేదు ..... నేనే గెలిచాను ..... బ్యాంక్ మానేజర్‌గారు ఎకౌంట్స్ టాలీ చెయ్యడంలో చిన్న మిస్టేక్ దొర్లింది. బ్యాంకులో వేసిన డబ్బును ఆయన చూశారుగానీ. మహతి మనసు బ్యాంకులో నేను అపురూపంగా డిపాజిట్ చేసిన ఈ అమూల్యమైన ఎకౌంట్ గురించి ఆయనకు తెలీదు.”

కొడుకును ముద్దుపెట్టుకుంటూ అన్నాడు మధుకర్.

హాలంతా ఇంద్రధనసులా మెరిసింది.

ఆనందాల వెల్లువ ఉప్పొంగింది.

ఆ మాటకు మహతి పెదవిమాటున చిరునవ్వు కదలాడింది.

మధుకర్ మాటకు, దిగులుపడ్డ హృదయంతో సుమదేవ్ మాత్రం తమిస్ర వేపు చూసాడు.

రాఘవేంద్ర నాయుడు మధుకర్ చేతిలోంచి బిడ్డను తీసికొని నుదుటిమీద ముద్దుపెట్టుకుని-- “ఒరే ..... చిట్టి రాఘవా ..... నవ్వరా ..... ” అన్నాడు.

చిట్టి రాఘవేంద్ర నాయుడు చిన్ని కళ్ళతో తాతయ్యను చూసి నవ్వాడు.

ఆ దృశ్యాన్ని కనులారా చూస్తున్న రాజేంద్ర ప్రసాద్, ఉషా కుమారిల వేపు ఓర కంటితో చూసింది మహతి.

హాలులో ఒక్కసారి మంగళ వాయిద్యాలు మిన్నంటాయి.

***** సమాప్తం *****